క్లుప్తంగా


ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష

పెడన: ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశానికి జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ) మెయిన్స్ పరీక్ష పెడన మండలంలోని నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. ఆదివారం రెండు షిఫ్టులలో 200 మంది విద్యార్థులు పరీక్షకు రాశారు. ఈ నెల 24వ తేదీన ప్రారంభమైన పరీక్షలు 26, 27వ తేదీలు మినహా ఈ నెల 31వ తేదీ వరకు జరుగుతాయని కేంద్రంలోని పరీక్షల అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. ఈ ఆరు రోజులకు వివిధ ప్రాంతాల నుంచి 856 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు.

కిడ్నీ బాధితునికి సాయం

ఘంటసాల(అవనిగడ్డ): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పాపవినాశనానికి చెందిన నెరుసు ఉమాకాంత్‌కు అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్ నాయుడు రూ.7 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొండవీటి కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ ఆత్కూరి సీతారామరాజు, గాదె వెంకటేశ్వరరావు, మేకా పావులు పాల్గొన్నారు.

దొంతులమ్మకు పూజలు



మచిలీపట్నంటౌన్: ఉల్లింగిపాలెంలోని దొంతులమ్మ అమ్మవారు ఆదివారం పూజలందుకున్నారు. అమ్మవారి 91వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలను ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

వేటూరికి ఘన నివాళి



అవనిగడ్డ: దివంగత సినీ రచయిత వేటూరి సుందరరామమూర్తి జయంతి కార్యక్రమం గాంధీక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ వేటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సినీ జగత్తు ఉన్నంత కాలం వేటూరి గీతం ఉంటుందన్నారు.

- పెదకళ్లేపల్లి(మోపిదేవి): వేటూరి సుందరామ్మూర్తి దివిసీమ వాసులు కావడంతో గర్వకారణమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా ఆశాదేవి అన్నారు. స్వగ్రామం పెదకళ్లేపల్లిలో వేటూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అరజా శ్రీ కాంత్, చోడగం నాని, గంధం వీరాంజనేయులు, కేబీఎస్ శర్మ, కూరేటి జగన్, అర్జా హరికృష్ణ, కొడాలి కోదండరామశర్మ, అరజా రాధిక తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కును ఢీకొని యువకుడికి గాయాలు



పెడన: రోడ్డుపక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఓ యువకుడు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గురువిందుగుంట గ్రామ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం చిలకలపూడికి చెందిన బి. ఇమ్మానుయేల్ పెడన మండలం కొప్పల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. వడ్లమన్నాడు నుంచి చెన్నూరు వెళ్లే రహదారిలోని గురువిందగుంట గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాకర్ ట్రక్కును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న చేవేంద్ర ఎంపీటీసీ అంకెం నరసింహారావు (గిరిబాబు) బాధితుడిని గుర్తించి తన వారితో ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అక్కడి నుంచి విజయవాడకు తరలించారు.

నేటి నుంచి లెప్రసీపై అవగాహన కార్యక్రమాలు

పామర్రు: మహాత్మా గాంధీ వర్ధంతి(షహీద్ దివాస్)ను పురస్కరించుకుని సోమవారం నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు లెప్రసీ అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కేతావతు కస్తూరి ఆదివారం తెలిపారు. సర్పంచ్ మాట్లాడుతూ తొలుత జాతిపిత గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమ సందేశమిస్తామన్నారు. గ్రామ పరిధిలోని ఐదు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామ పంచాయతీ కార్యక్రమం వద్ద జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమం

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం పదో డివిజన్‌లో నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ బాషాతో కలిసి కిట్టు గడప గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా కుటుంబాల వారికి మంజూరు చేసిన వివిధ సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బుక్‌లెట్లను వారికి అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజికాభివృద్ధే ధ్యేయంగా బడుగు, బలహీనవర్గాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా పలు పథకాలను రూపొందించి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును నేరుగా జమ చేస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఆయా రంగాల అభివృద్ధికి తోడ్పాటును ఇస్తున్నారన్నారు. తనకు వైఎస్సార్ పింఛను కానుక ద్వారా రూ. 82 వేలు, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ. 37,500 మొత్తం రూ 1,19,500, ఇంటిస్థలం, పక్కా గృహం మంజూరయ్యాయని స్థానికురాలు తూముల బాలమ్మ తెలిపింది. ఈ కార్యక్రమంలో పేర్ని కిట్టు వెంట సుంకర రాఘవరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చీలి రవీంద్ర పలు డివిజన్ల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: మండలంలోని రాయవరం గ్రామంలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేస్తారని చెప్పారు.

సంక్షేమ పాలనను ప్రజలకు వివరించండి

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మచిలీపట్నం నగర పాలక సంస్థ వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పిలుపునిచ్చారు. నగరంలోని పలు డివిజన్లలో ఆదివారం పార్టీ గృహ సారథుల నియామక సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు శీలం బాబ్జీ, గూడవల్లి నాగరాజు, చిటికిన నాగేశ్వరరావు ఆయా డివిజన్లలో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారని, గృహ సారథులు వారి పరిధిలోని గృహాలకు వెళ్లి వారికి అందిన లబ్ధిని వివరించాలన్నారు. ఆయా కుటుంబాల వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో గృహ సారథులను నియమించారు. ఈ సమావేశాల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జీలు, డివిజన్ కన్వీనర్లు పాల్గొన్నారు.



గృహ సారథులతో కన్వీనర్ శీలం బాబ్జీ

700 మందికి వైద్య సేవలు

చల్లపల్లి: లయన్స్ క్లబ్ సేవా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తోందని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దామెర్ల శ్రీశాంతి అన్నారు. ఆదివారం స్థానిక విజయా హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో విజయవాడ పళ్లెం పెద్దేశ్వరరావు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారిచే ఉచిత మెగా గుండె వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని శ్రీశాంతి ప్రారంభించగా.. డాక్టర్ పళ్లెం పెద్దేశ్వరరావు, డాక్టర్ ఆకాష్, డాక్టర్ పళ్లెం మనోప్రియ, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ శశిధర్‌లు 700 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు.

బాధితుడికి సాయం..

చల్లపల్లి మండలం వెలువోలు అగ్ని ప్రమాద బాధితుడు బొల్లా శ్రీనివాసరావుకు క్లబ్ ఆధ్వర్యంలో రూ.15 వేల వ్యయంతో మంచం, బీరువా, నూతన వస్త్రాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ అవార్డు గ్రహీత తగిరిశ సాంబశివరావును ఘనంగా సన్మానించారు. శిబిరాన్ని క్లబ్ అధ్యక్షులు ఏఎల్‌ఆర్‌కే ప్రసాద్, కార్యదర్శి నర్రా సాయిబాబు, క్లబ్ జిల్లా ప్రముఖులు వీవీపీఎస్ ఆంజనేయులు, ఎన్‌వీవీఎస్‌వీ ప్రసాద్, జడ్‌సీ పీ.ఎస్.విజయబాబు, ముమ్మనేని నాని, వరదా హరిగోపాల్, కస్తూరి ప్రసాద్, కృష్ణారావు, రాధాకృష్ణ పర్యవేక్షించారు. వివేకానందా ఎస్ఎస్ఎస్ వలంటీర్లు, విజయా హైస్కూల్ సిబ్బంది సేవలు అందించారు.



మాట్లాడుతున్న లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీశాంతి

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య హవనం



మోపిదేవి సుబ్బారాయుడి ఆలయంలో నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్య హవనం



స్వామివారి దర్శనార్థం క్యూ లైన్‌లో భక్తులు

మోపిదేవి: మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్థానిక టీడీపీ కల్యాణ మండపం జమ్మిచెట్టు వద్ద శమీవృక్ష పూజ జరిగింది. అనంతరం మయూర వాహనంపై ఉభయ దేవేరులతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సుబ్రహ్మణ్య హవనంలో పలువురు పుణ్య దంపతులు పాల్గొని హోమాలు చేశారు.

ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వక్ఫ్ బోర్డు డైరెక్టర్ల నియామకంపై హర్షం

కైకలూరు: ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డ్‌లో నియోజకవర్గానికి చెందిన ఇరువురికి డైరెక్టర్లుగా అవకాశం లభించింది. వైఎస్సార్ సీపీ పట్ల అంకితభావంతో పనిచేసిన కలిదిండి మండలానికి చెందిన షేక్ ఖాన్ బాషా, కైకలూరుకు చెందిన షేక్ రహంతుల్లాకు నియామక ఉత్తర్వులు ఆదివారం అందాయి. దీంతో నియామకానికి కృషి చేసిన చేసిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను స్థానిక నివాసం వద్ద మర్యాదపూర్వకంగా ముస్లింలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరు వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యుడు సఫాయితుల్లా, ఏఎంసీ డైరెక్టర్ షేక్ ముసా, ముస్లింలు షేక్ రఫీ, అబ్దుల్ హమీద్, దండే రవిప్రకాష్ పాల్గొన్నారు.



నూతన డైరెక్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఆక్వా జోన్ సర్వేలో ఇబ్బందులు తొలగించండి

కైకలూరు: ఆక్వా జోన్‌లోకి నాన్ ఆక్వాజోన్ చేపల, రొయ్యల చెరువుల సర్వే నంబర్లు చేర్చే ప్రక్రియలో ఇబ్బందులను తొలగించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ అధికారులకు సూచించారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో మత్స్య, విద్యుత్ శాఖల అధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ కేటగిరీల వారీగా సర్వే నిర్వహించారన్నారు. కొంత మంది అర్హులైన రైతుల పేర్లు అనర్హుల జాబితాలో వచ్చాయని, దీని కారణంగా వారు ప్రభుత్వ విద్యుత్ సబ్సిడీకి దూరమవుతారన్నారు. ఇటువంటి రైతుల భూములను రీసర్వే చేసి అర్హత జాబితాలో చేర్చాలన్నారు. ఈ విషయమై మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఆక్వా రైతుకు సబ్సిడీ అందిస్తామన్నారు. సమావేశంలో మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, విద్యుత్‌శాఖ ఏడీ బి.రామయ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు ఎం.భవిత, బి.శ్రీనివాస్, సతీష్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈలు సత్యనారాయణ, నాగేశ్వరరావు, రవికుమార్, మల్లికార్జున్, రామకృష్ణ, గ్రామ మత్స్యశాఖ సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు పరిశీలన

తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును కేంద్ర ప్రభుత్వ మానిటరింగ్ బృందం పరిశీలించింది. మండలంలోని కుమ్మమూరు, కనకవల్లి గ్రామాల్లో డీపీఎం వై.రాజగోవింద్ ఆధ్వర్యంలోని కేంద్ర మానిటరింగ్ బృందం ఆదివారం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించటంతో పాటు ఆయా పథకాలకు సంబంధించిన లబ్దిదారులతో మాట్లాడారు. బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధిహామీ ఏపీడీ శ్రీలత, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, సర్పంచ్‌లు బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పీవీ నరసింహశర్మ, ఆయా పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావుకు సన్మానం



చల్లపల్లి: నూతన లాయర్లకు మత్తి వెంకటేశ్వరరావు ఆదర్శనీయులని విశ్రాంత ఐఆర్‌టీఎస్ అధికారి అరజా శ్రీకాంత్ అన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ న్యాయవాది అవార్డు అందుకున్న మత్తి వెంకటేశ్వరరావు సన్మాన కార్యక్రమం ఆదివారం రాత్రి స్థానిక సంపటాలమ్మ కల్యాణ మండపంలో జరిగింది. మత్తి వెంకటేశ్వరరావు వద్ద జూనియర్లుగా ప్రాక్టీస్ చేసి రెండు తెలుగు రాష్ట్రాల్లో న్యాయవాదులుగా స్థిరపడిన 28 మంది కలిసి ఆయనకు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఘంటా రామారావు, సభ్యులు కె.చిదంబరం, ఆర్.మాధవి, అవనిగడ్డ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ల నాయకులు మాట్లాడుతూ మత్తి వెంకటేశ్వరరావు న్యాయవాదిగా చేసిన సేవలను వివరించారు. ప్రముఖ న్యాయవాది, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఎంపీపీ కోట విజయ రాధిక, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు అండగా ఉంటాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని, నేతలు

గుడివాడటౌన్: చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. స్థానిక కాకర్ల వీధిలోని జయలక్ష్మి ఇంజినీరింగ్ వర్క్స్ అధినేత అల్లం రామ్మోహనరావు గృహంలో సంస్థ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించి గత ప్రభుత్వం రూ.500 కోట్లు బకాయి ఉండగా సీఎం వైఎస్ జగన్ రూ.350 కోట్లు విడుదల చేశారన్నారు. మిగిలిన బకాయిలను త్వరలో విడుదల చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, శేషగిరిరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అల్లం సూర్యప్రభ, వెంకటలక్ష్మి, మూడెడ్ల ఉమ, హారిక, రమీజా, సునీత, రాణి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సత్ప్రవర్తనే లక్ష్యం

పామర్రు: విద్యార్థుల్లో సత్ప్రవర్తన పెంపొందించేందుకు మానవత ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు పామర్రు మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక అరండల్ పేటలోని మానవత కార్యాలయం వద్ద సర్వ సభ్యసమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పరివర్తన కల్పించేందుకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణా తరగతులను నిర్వహించి వారిలో మార్పు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. మానవత చైర్మన్ శీతాల ప్రసాద్, కార్యవర్గ ప్రతినిధులు కొల్లా శ్రీనివాసరావు, ఎన్.త్రివిక్రమరావు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నంలోని హిందూ ఉన్నత పాఠశాలలో 1975–78 మధ్య చదివిన విద్యార్థుల అపూర్వ కలయిక స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగింది. విద్య, ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఇక్కడికి చేరుకుని తోటి విద్యార్థులతో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో వారి విద్యాభ్యాసం సమయంలో జరిగిన పలు ఘటనలు, నాడు గడిపిన క్షణాలను జ్ఞప్తికి తెచ్చుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు కేఆర్‌కేఎం, పీవీ శాస్త్రి, ఎం. పాండురంగారావు, మంగాదేవిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పరుచూరి రమణ, చందన శ్రీనివాసరావు, తమ్మన ఉదయభాస్కర్, ఎం. మధుభాస్కర్ పర్యవేక్షించారు.

ఆరోగ్య శ్రీతో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

- మంత్రి జోగి రమేష్
- కంకటావలో ఉచిత వైద్య శిబిరం

గూడూరు: ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదలకు కూడా కార్పొరేట్ వైద్యాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరిన్ని వైద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చి నిరుపేదలకు అండగా నిలిచారని చెప్పారు. గూడూరు మండలం కంకటావలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి జోగి రమేష్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స అందించే ఆస్పత్రుల సంఖ్యను పెంచడమే కాకుండా పథకం ద్వారా అందించే వైద్య చికిత్సలను కూడా విస్తృతం చేసిందని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్న అనంతరం కూడా వారికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. శిబిరంలో 325మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్ మెట్ల మధుసూదనరావు వైద్య సేవలు అందించారు. గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్ నాయుడు, ఎంపీపీ సంగా మధుసూదనరావు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవి, బొర్రా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి జోగి రమేష్

కనుల పండువగా భావనాఋషి గ్రామోత్సవం





ప్రత్యేక వాహనంపై భద్రావతి, భావనాఋషి స్వామివార్లు : ఆకట్టుకుంటున్న స్వామివారి ప్రభ

కోడూరు: స్థానిక ఆరో వార్డులో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనాఋషి స్వామి వారి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలను పురస్కరించుకొని స్వామివార్ల గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పులివాహనంపై కల్యాణమూర్తులను ఊరేగించారు. కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో గ్రామోత్సవం జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారి ప్రభను ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగర సంగమం వద్ద సింధు స్నానాలకు అనుమతి

జల్లు స్నానాలకు ఏర్పాట్లు

కోడూరు: కృష్ణమ్మ సముద్రంలో కలిసే పవిత్ర సాగర సంగమం వద్ద సింధు స్నానాలు చేసేందుకు భక్తులకు అనుమతిస్తున్నామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఫిబ్రవరి 5వ తేదీన హంసలదీవి సాగర తీరంలో నిర్వహించే సింధుస్నానాలపై వివిధ శాఖల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. కేవలం పాలకాయతిప్ప బీచ్ వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తామని, సాగర సంగమం వద్ద సింధు స్నానాలకు అనుమతి లేదని అధికారులు ప్రకటించగా.. దీనిపై భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

ఈ నేపథ్యంలో భక్తుల మనోభావాలను గౌరవిస్తూ సాగర సంగమం వద్ద సింధు స్నానాలకు అనుమతి ఇస్తున్నామని తహసీల్దార్ ప్రకటించారు. సాగర సంగమం వద్ద లోతు అధికంగా ఉండటంతో పటిష్టమైన బారికేడింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంగమం వద్ద భక్తుల కోసం ప్రత్యేకంగా జల్లు స్నానాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పర్యాటకులు నిర్భయంగా సింధు స్నానాలు ఆచరించవచ్చని తెలిపారు. అవనిగడ్డ నుంచి హంసలదీవికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.



హంసలదీవి సాగర సంగమం ప్రాంతం

లింగారెడ్డిపాలెంలో పూరిల్లు దగ్ధం

కోడూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లో లింగారెడ్డిపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన గుర్రం యాగప్ప తనకున్న పూరింటిలో నివాసముంటున్నాడు. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి మంటలు రావడాన్ని గమనించిన యాగప్ప భయంతో బయటకు పరుగులు తీశాడు. అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో విలువైన గృహోపకరణలతో పాటు సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

రెడ్‌క్రాస్ సాయం..

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు యాగప్పకు మండల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాధితుడికి బియ్యం, దుస్తులు, గృహోపకరణలను అందించారు. సొసైటీ మండల అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు, సభ్యులు తోట శ్రీనివాసరావు, కొండవీటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

